
కృష్ణమూర్తి, కోదండరెడ్డిలను సత్కరిస్తున్న నిర్వాహకులు

ప్రజా సేవ శాశ్వతంగా నిలుస్తుంది : కోదండరెడ్డి

ప్రజాశక్తి - కల్చరల్

కోట్ల రూపాయలు ఇవ్వని సంతోషం ప్రజలు చూపే ఆదరాభిమానాలు ఇస్తుందని రుణమాఫీ చైర్మన్ కోదండరెడ్డి అన్నారు. ప్రజలకు చేసిన సేవ, సహాయం శాశ్వతంగా నిలుస్తాయని తెలిపారు. శ్రీ త్యాగరాయ గానసభ ప్రధాన వేదికపై సీల్ వెల్ కార్పొరేషన్ శ్రుతి లయ ఆర్ట్స్ అకాడమీ, అర్అర్ ఫౌండేషన్ నిర్వహణలో మహాత్మా గాంధీ స్ఫూర్తి పురస్కారాల ప్రధానం బుధవారం జరిగింది. కోదండరెడ్డికి, స్వాతంత్ర్య సమరయోధుడు కృష్ణమూర్తికి పురస్కారాలు ప్రధానం చేశారు. పురస్కారం అందుకున్న కోదండరెడ్డి మాట్లాడుతూ.. తాను రెండు సార్లు ముషీరాబాద్ నుండి శాసనసభ సభ్యునిగా ఎన్నికయ్యానని, ఈ నియోజకవర్గ ప్రాంతమైన గాన సభలో తనను సత్కరించడం సంతోషంగా ఉందని తెలిపారు. ఈ నియోజకవర్గ ప్రజలు ఇప్పటికీ తాను చేసిన కృషిని గుర్తు చేస్తూ ఉంటారని చెప్పారు. గాంధీజీ అహింసతో బ్రిటిష్ వారిని దేశం నుంచి వెళ్లగొట్టారని, అదే సిద్ధాంతం పాటించాలని కోరారు. పోలీస్ హౌసింగ్ కార్పొరేషన్ పూర్వ చైర్మన్ కోలేటీ దామోదర్ మాట్లాడుతూ నిస్వార్థ దేశ భక్తులు ఏటుకూరి కృష్ణమూర్తి, కోదండరెడ్డి లాంటి వారు అతి తక్కువ మంది మాత్రమే ఉన్నారని కొనియాడారు. కళారఫీ పురస్కార గ్రహీతలను పరిచయం చేశారు. అధ్యక్షత వహించిన సంఖ్యా శాస్త్రవేత్త దైవజ్ఞశర్మ మాట్లాడుతూ.. గాంధీజీ సిద్ధాంత కర్మ యోగులు కృష్ణమూర్తి, కోదండ రెడ్డి అని అన్నారు. కృష్ణమూర్తి వామపక్ష భావశీలి అని అభినందించారు. సంస్థ చైర్మన్ భీం రెడ్డి కుసుమ భోగరాజు పాల్గొన్న సభలో సంస్థ కార్యదర్శి ఆమని స్వాగతం పలికారు.

మరిన్ని బ్రెయిన్ స్ట్రోక్ సెంటర్లు తెరుస్తాం

- ఎల్‌బి నగర్ శాఖలో 50 శాతం రాయితీ
- నాసా హాస్పిటల్స్ వెల్లడి

ప్రజాశక్తి - హైదరాబాద్

మెదడు, వెన్నెముక సంబంధిత వ్యాధులకు చికిత్సలందిస్తున్న నాసా హాస్పిటల్స్ మరిన్ని సెంటర్లను తెరిచే యోచనలో ఉంది. ఇటీవలే ఎల్‌బి నగర్‌లో కాంప్రహెన్సివ్ బ్రెయిన్ స్ట్రోక్ సెంటర్‌ను 120 పడకలతో అందుబాటులోకి తెచ్చామని నాసా హాస్పిటల్స్ ఫౌండర్ అండ్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ డాక్టర్ రియాజ్ తెలిపారు. విజయవాడలోనూ ఒక సెంటర్ ఉందన్నారు. త్వరలో వైజాగ్, పూణెలో కొత్త శాఖలను ఏర్పాటు చేసే యోచనలో ఉన్నామన్నారు. ఎల్‌బి నగర్‌లోని హాస్పిటల్ ప్రారంభోత్సవ సందర్భంగా 50 శాతం రాయితీతో బ్రెయిన్ స్ట్రోక్ ప్రివెంటివ్ ప్యాకేజీ, సీటీ స్కాన్, ఎంఆర్ఐ స్కాన్‌లను అందిస్తున్నామన్నారు. ఆధునిక జీవన విధానాలు, తీవ్రమైన మానసిక ఒత్తిడుల కారణంగా ఎక్కువ మంది ప్రజలు మెదడు, వెన్నెముక సంబంధిత సమస్యలు, మరీ ముఖ్యంగా.. బ్రెయిన్ స్ట్రోక్ (పక్షవాతం)కు గురవుతున్నారన్నారు. ఒకప్పుడు 60 ఏళ్లు పైబడిన వారిలో ఈ రుగ్మతలు వచ్చేవని అన్నారు. ఇప్పుడు 30 ఏళ్లు పైబడిన వారిలోనూ వస్తోన్నాయన్నారు. మెదడు, వెన్నెముఖకు సంబంధించిన సమగ్ర వైద్య సేవలను అందించడమే తమ లక్ష్యమన్నారు. ప్రముఖ స్పైన్ సర్జన్ జిపివి సుబ్బయ్య, బ్రెయిన్ అండ్ స్పైన్ సర్జన్ డాక్టర్ వి శ్రీధర నారాయణ, డాక్టర్ వెణుతురుమిల్లి రాకేష్, డాక్టర్ ఎం. కార్తీక్, డాక్టర్ కె. పృథ్వి రాజ్ తదితర నిష్ణాతులైన వైద్య నిపుణులు తమ సెంటర్‌లో సేవలందిస్తారని వెల్లడించారు. బ్రెయిన్ స్ట్రోక్ నుంచి ప్రజలను రక్షించేందుకు 'బీ ఫాస్ట్' ప్రోగ్రాంను రూపొందించామని న్యూరాలజిస్ట్ డాక్టర్ నవీన్ కుమార్ తెలిపారు.

విద్యార్థిని మృతదేహం వద్ద రోదిస్తున్న కుటుంబ సభ్యులు

ప్రయివేట్ పాఠశాల బస్సు ఢీకొని విద్యార్థిని మృతి

హైదరాబాద్ బ్యూరో : మెదక్ జిల్లా పెద్ద శంకరంపేటలోని సాయి చైతన్య ప్రయివేటు పాఠశాలకు చెందిన బస్సు ఢీకొని అదే పాఠశాలలో చదువుతున్న విద్యార్థిని మృతి చెందారు. అల్లాదుర్గం సీఐ రేణుక రెడ్డి, స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. మండల పరిధిలోని మత్త లక్ష్మాపూర్ గ్రామానికి చెందిన బోయిని చందు, సరితలకు ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. మొదటి కుమార్తె అశ్విని (6) పెద్ద శంకరంపేటలోని సాయి చైతన్య స్కూల్లో ఒకటవ తరగతి చదువుతుంది. ప్రతిరోజు మాదిరిగానే బుధవారం కూడా పాఠశాల ముగిసిన అనంతరం గ్రామాల్లో పిల్లలను దించేందుకు వెళ్లిన బస్సు లక్ష్మాపూర్‌లో విద్యార్థిని అశ్వినిని కిందకు దించారు. బస్సు నుంచి కిందకు దిగిన విద్యార్థిని అశ్విని ఎటు వెళ్తుందో గమనించకుండా బస్సు డ్రైవర్ నిర్లక్ష్యంగా బస్సు నడిపి ఆశ్వినిని ఢీకొట్టడంతో ఆమె అక్కడికక్కడే మృతి చెందింది. అక్కడే ఉన్న గ్రామస్థులు ఆగ్రహంతో డ్రైవర్ నిర్లక్ష్యమే విద్యార్థిని మృతికి కారణమంటూ సాయి చైతన్య పాఠశాల బస్సు అద్దాలు, కిటికీలను ధ్వంసం చేశారు. పాఠశాల యాజమాన్యంపై, బస్సు డ్రైవర్‌పై పోలీసులు తక్షణమే కఠిన చర్యలు తీసుకోవాలని గ్రామస్తులు డిమాండ్ చేశారు. సంఘటనా స్థలానికి చేరుకున్న అల్లాదుర్గం సీఐ రేణుక రెడ్డి, పెద్ద శంకరంపేట ఎస్ఐ శంకర్, ఏఎస్ఐ సునీత, సిబ్బంది వివరాలు సేకరించారు.

బాలికపై సిఐ అత్యాచారయత్నం

- పోక్సో కేసు నమోదు

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

బాలికపై అత్యాచారయత్నం చేసిన సిఐపై పోక్సో చట్టం కింద మంగళవారం రాత్రి కేసు నమోదు చేసినట్టు కాజీపేట అడ్మిన్ ఎస్ఐ నవీన్‌కుమార్ తెలిపారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. హనుమకొండ జిల్లా వడ్డేపల్లిలోని పీజీఆర్ అపార్ట్‌మెంట్స్‌లో నివాసం ఉంటున్న సీఐ.. ఆదిలాబాద్ జిల్లా హెడ్‌క్వార్టర్స్‌లో పనిచేస్తున్నారు. సెలవులపై హనుమకొండకు రాగా, బుధవారం ఇన్‌స్పెక్టర్ రవికుమార్ స్థానికంగా నివాసం ఉండే మైనర్ బాలికను లైంగిక వేధింపులకు గురిచేస్తూ అత్యాచారయత్నం చేయగా బాలిక తల్లిదండ్రులకు చెప్పింది. వెంటనే బాధితురాలి తల్లిదండ్రులు పోలీసులను ఆశ్రయించి ఫిర్యాదు చేశారు. దాంతో కాజీపేట పోలీస్‌స్టేషన్‌లో పోక్సోచట్టం కింద కేసు నమోదు చేసి దర్యాప్తు కొనసాగిస్తున్నారు. సీఐ రవికుమార్ గతంలో మామునూర్, మడికొండ పోలీస్ స్టేషన్‌ల్లో విధులు నిర్వర్తించారు.

డిజిటల్ పసిడిపై ఫోన్‌పే క్యాష్ బ్యాక్

హైదరాబాద్ బ్యూరో : వచ్చే దంతేరస్, దీపావళి పండుగల సందర్భంగా 24 క్యారెట్ల స్వచ్ఛత కలిగిన బంగారంపై రూ.2000 వరకు గ్యారంటీ క్యాష్‌బ్యాక్‌ను అందిస్తున్నట్లు ఫోన్‌పే తెలిపింది. ఫోన్‌పే నుండి వినియోగదారులు కనీసం రూ.1500 విలువ చేసే బంగారం కొనుగోలుపై గ్యారంటీడ్ క్యాష్‌బ్యాక్‌ను అందుకోవచ్చని పేర్కొంది. అక్టోబర్ 29 నుంచి నవంబర్ 1 వరకు ఈ ఆఫర్ అందుబాటులో ఉంటుందని వెల్లడించింది. ఎంత మొత్తంలో అయినా డిజిటల్ గోల్డ్‌లో పెట్టుబడి పెట్టవచ్చని తెలిపింది.

గోబ్యాక్.. గోబ్యాక్..

- విషపు కోరలు చాచిన ఫ్యాక్టరీ మాకొద్దంటూ..
- అంబుజా సిమెంట్స్‌పై అందరిదీ ఒకే మాట.. ఒకే నినాదం..
- రసాభాసగా ప్రజాభిప్రాయ సేకరణ
- పలువురి నేతల ముందస్తు అరెస్టులు


ప్రజాభిప్రాయ సేకరణలో ప్లకార్డులు ప్రదర్శిస్తు నిరసన తెలుపుతున్న ప్రజలు

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

"విషపు కోరలు చాచి వాయు, జల, ధ్వని కాలుష్యాన్ని విస్తరింపజేసే అదానీ గ్రూపు వారి అంబుజా సిమెంట్ ఫ్యాక్టరీ నిర్మాణం మాకొద్దు.. గో బ్యాక్ అంబుజా.. గో బ్యాక్.." అంటూ అంబుజా సిమెంట్ ఫ్యాక్టరీ నిర్మాణంపై జరిగిన ప్రజాభిప్రాయ సేకరణ కార్యక్రమంలో ప్రజల నినాదాలు మారుమోగాయి. యాదాద్రిభువనగిరి జిల్లా రామన్నపేట మండల కేంద్రంలో అంబుజా ఫ్యాక్టరీ నిర్మాణంపై బుధవారం పర్యావరణ అనుమతుల ప్రజాభిప్రాయ సేకరణను జిల్లా అడిషనల్ కలెక్టర్ బెన్‌షాలోమ్ అధ్యక్షతన నిర్వహించారు. కార్యక్రమానికి మండలవ్యాప్తంగా రెండు వేలకు పైగా రైతులు, కుల వృత్తుల వారు, సబ్బండ వర్గాల ప్రజలు సభా ప్రాంగణానికి చేరుకొని ప్లకార్డులు, నల్లజెండాలు పట్టుకొని.. 'గో బ్యాక్ అంబుజా..' 'అంబుజా వద్దురా.. రామన్నపేట ముద్దురా..' అని రాసున్న టీ షర్ట్స్‌తో నిరసన వ్యక్తం చేశారు. వ్యాపారులు స్వచ్ఛందంగా దుకాణాలను బంద్ చేసి కార్యక్రమానికి హాజరయ్యారు. మేధావులు, అన్ని రాజకీయ పార్టీల నాయకులు పరిశ్రమ ఏర్పాటును ముక్తకంఠంతో వ్యతిరేకించారు. ఉదయం 11గంటల నుంచి ఒంటి గంట వరకు కొనసాగాల్సిన ప్రజాభిప్రాయ సేకరణ రసాభాసగా సాగడంతో 12.30 గంటలకే అభిప్రాయ సేకరణ ముగిసిందని పర్యావరణ శాఖ అధికారి సునిత ప్రకటించారు.

విషపు కోరలు చాచిన కాలుష్యపు ఫ్యాక్టరీ మాకొద్దు

రైతులను డ్రైపోర్టు పేరుతో మోసం చేసి 350 ఎకరాల భూములను కొనుగోలు చేసి మాట మార్చేసి అంబుజా సిమెంట్ ఫ్యాక్టరీని ఏర్పాటు చేస్తున్నామని గత నెల 21న పత్రికా ప్రకటనతో మేం ఖంగుతిన్నాం.. మాకొద్దు ఈ విషపు కోరలు చాచిన కాలుష్యపు ఫ్యాక్టరీ అంటూ మండల యువత, న్యాయవాదులు, సిపిఎం, కాంగ్రెస్, బీఆర్ఎస్, ప్రజాసంఘాలు, కులవృత్తుల వారు ముక్త కంఠంతో వ్యతిరేకించి నిరసన వ్యక్తం చేశారు. అంబుజా సిమెంట్ పరిశ్రమ నెలకొల్పడాన్ని విరమించుకోకపోతే న్యాయపోరాటానికి సిద్ధమవుతామని, హైకోర్టులో ప్రజావ్యాజ్యం దాఖలు చేస్తామని న్యాయవాదులు జింకల ప్రభాకర్, మామిడి వెంకట్‌రెడ్డి, బార్ అసోసియేషన్ అధ్యక్షులు మజీద్ హెచ్చరించారు.

పలువురి నాయకుల అరెస్టు

అంబుజా సిమెంట్ ఫ్యాక్టరీ ప్రజాభిప్రాయసేకరణకు వస్తున్న నకిరేకల్ మాజీ ఎమ్మెల్యే చిరుమర్తి లింగయ్యను జాతీయ రహదారి 65పై నార్కట్‌పల్లి సీఐ నాగరాజు ఆధ్వర్యంలో అరెస్టు చేశారు. నల్లగొండ ఎమ్మెల్యే కంచర్ల భూపాల్‌రెడ్డిని ముందస్తుగా గృహనిర్బంధం చేశారు. ఇతర పార్టీల నేతలను, ప్రజాసంఘాల నాయకులను అదుపులోకి తసీఉకొని అనంతరం వదిలిపెట్టారు.

నిర్మాణాన్ని విరమించుకోవాలి : సిపిఎం

పచ్చని పంటపొలాలతో, కులవృత్తులతో జనజీవనం సాగించే రామన్నపేట మండలం, చిట్యాల, నార్కట్‌పల్లి మండలాలు. జల, వాయు, ధ్వని కాలుష్యం విస్తరింపజేసే సిమెంట్ ఫ్యాక్టరీ నిర్మాణానికి రామన్నపేట మండలం కేంద్రం అనువైన స్థలం కాదు. జనావాసాల మధ్య డ్రైపోర్టు పేరుతో భూసేకరణ చేసి సిమెంట్ పరిశ్రమ నిర్మాణం చేపడతామంటే సబ్బండ వర్గాలు వంద శాతం వ్యతిరేకిస్తున్నాయి. ఈ నిర్మాణాన్ని విరమించుకోవాలి.

ప్రజలు చెప్పిన నిజమైన రిపోర్టు అందజేయాలి : ఎమ్మెల్సీ కోటిరెడ్డి

జనావాసాలకు దూరంగా ఉండాల్సిన సిమెంట్ ఫ్యాక్టరీ వ్యవసాయ క్షేత్రాల్లో నిర్మించడం సరికాదు. ప్రజలు ముక్తకంఠంతో వ్యతిరేకిస్తున్నారు. ప్రజలు చెప్పిన అభిప్రాయాల వాస్తవ రిపోర్టును ప్రభుత్వానికి అందజేయాలి. ప్రజలు ఈ పరిశ్రమను ఇక్కడి నుండి తరలించేంత వరకూ పోరాటం చేస్తారు. వారికి తమ మద్దతు ఉంటుంది.

మహారాజశ్రీ జమ్మలమడుగు జూనియర్ సివిల్ జడ్జి కోర్టులో

O.S.No. 88/2023

ఊట్ల కైలాసపతి, తండ్రి వెంకటపతి, హిందూ, వయసు 70, రిటైర్డ్ ఉద్యోగి, డోర్ నెంబర్ 23-17, 82. కాశీ మట్ వెనక, తిరుమల రెడ్డి నగర్, డీమార్ట్ ఎదురుగా, కరకంబాడి రోడ్డు, బాలాజీ జిల్లా. ...వాది

V/s

1. D1 ఊట్ల శ్రీనివాస, తండ్రి వెంకటేశ్వర్లు, హిందూ, వయసు 52 సంవత్సరాలు, సాఫ్ట్ వేర్ ఇంజనీరు.
2. D4 ఊట్ల రమేష్ కుమార్, వయసు 43 సంవత్సరాలు, సాఫ్ట్ వేర్ ఇంజనీరు.
3. D5 ఊట్ల శ్రీవాణి, భర్త మణి, తండ్రి ఊట్ల వెంకటేశ్వర్లు, వయసు 42 సంవత్సరాలు, గృహిణి.
4. D6 ఊట్ల పద్మజ్యోతి, భర్త సురేంద్ర, తండ్రి ఊట్ల వెంకటేశ్వర్లు, వయసు 40 సంవత్సరాలు, గృహిణి. పై వారందరి అడ్రస్. ఫ్లాట్ నెంబర్ 401, 5వ ఫ్లోర్, వాహినీస్ వెంకటేశ్వర ప్లాజా, సుమిత్ర నగర్, మెయిన్ రోడ్డు, కూకట్ పల్లి, హైదరాబాద్.

...ప్రతివాదులు

సమన్లు

వాది బాగపరిష్కార నిమిత్తం దావా మీమీద వేసినందున 18.11.2024 న పై కోర్టు నందు హాజరుకావలెను. లేని పక్షంలో మీకు పరోక్షంగా తీర్మానించబడును.

వాయిదా తేది: 18.11.2024

ఉండేల. ముని సుబ్బారెడ్డి,
వాది తరపు న్యాయవాది, జమ్మలమడుగు.

ప్రజా సమస్యల పరిష్కారానికి చర్యలు

- ప్రభుత్వానికి సిపిఎం డిమాండ్
- మ్యానిఫెస్టో అమల్లో జాప్యం వీడాలి
- మూసీ పునరుజ్జీవం పేరుతో పేదల ఇళ్ల తొలగింపు ఆపాలి
- రైతు భరోసా తక్షణమే ఇవ్వాలి
- సిపిఎం రాష్ట్ర కమిటీలో పలు తీర్మానాలు

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

రాష్ట్ర ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారానికి తక్షణమే చర్యలు చేపట్టాలని సిపిఎం రాష్ట్ర కమిటీ ప్రభుత్వాన్ని డిమాండ్ చేసింది. బుధవారం హైదరాబాద్‌లోని ఎంబీ భవన్‌లో కేంద్ర కమిటీ సభ్యులు చెరుపల్లి సీతారాములు అధ్యక్షతన ఆ పార్టీ రాష్ట్ర కమిటీ సమావేశం జరిగింది. ఆ పార్టీ పొలిట్‌బ్యూరో సభ్యులు ఎ విజయరాఘవన్, బివి రాఘవులు, రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని వీరభద్రం, రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు ఎస్ వీరయ్య తదితరులు పాల్గొన్న రాష్ట్ర కమిటీ సమావేశంలో పలు అంశాలపై తీర్మానాలను ఆమోదించింది. వాటిని మీడియాకు విడుదల చేసింది.

కాంగ్రెస్ పార్టీ ఎన్నికలకు ముందు ప్రజా సమస్యల పరిష్కారానికి మ్యానిఫెస్టోలో ప్రకటించిన అంశాలను అమలుపర్చడంలో జాప్యం చేస్తున్నదని తెలిపింది. ముఖ్యంగా 49 కేంద్రాల్లో ఇండ్ల స్థలాల సమస్యను పరిష్కరించకుండా, పేదల ఇండ్లను పడగొట్టి వారిపై అక్రమ కేసులు బనాయిస్తున్నదని విమర్శించింది. ఒకవైపు ప్రజాపాలన అంటూనే ప్రజలపై నిర్బంధాన్ని కొనసాగిస్తున్నదని పేర్కొంది. మూసీ పునరుజ్జీవం పేరుతో నదికి ఆనుకుని ఉన్న ఇండ్లను, పునరావాసం చూపకుండానే తొలగించడానికి చేస్తున్న ప్రయత్నాన్ని సిపిఎం తీవ్రంగా వ్యతిరేకిస్తున్నట్టు ప్రకటించింది. రివర్‌బెడ్‌లో ఇండ్లు నిర్మాణం చేసుకున్న వారికి ప్రత్యామ్నాయం చూపాలని డిమాండ్ చేసింది.

రీజినల్ రింగ్‌రోడ్ (ట్రిబుల్‌ఆర్)కు మొదట నిర్ణయించిన అలైన్‌మెంట్‌నే రాష్ట్ర ప్రభుత్వం అమలు చేయాలని కోరింది. 2013 భూసేకరణ చట్టం ప్రకారం మార్కెట్ ధరకు మూడు రెట్లు పెంచి భూములు కోల్పోతున్న రైతులకు పరిహారం చెల్లించాలని తెలిపింది. స్కీమ్ వర్కర్లకు, గ్రామపంచాయతీ, మున్సిపల్, మెడికల్, హెల్త్, కాంట్రాక్ట్ కార్మికులకు బకాయి వేతనాలను తక్షణమే చెల్లించాలని పేర్కొంది. కాంట్రాక్ట్ కార్మికులను పర్మినెంట్ చేయాలని డిమాండ్ చేసింది. కనీసవేతనం నెలకు రు.11 వేలుగా పెట్టిన డ్రాఫ్ట్ ప్రతిపాదనను ఉపసంహరించాలని ప్రభుత్వాన్ని కోరింది. కనీస వేతనం నెలకు రు.26 వేలుగా నిర్ణయించాలని సూచించింది. అంగన్‌వాడీల రిటైర్‌మెంట్ బెనిఫిట్, ఆశాల ఫిక్స్‌డ్ వేతనం, మధ్యాహ్న భోజనం కోసం కేటాయింపుల పెంపుదల తదితర సమస్యలు పరిష్కరించాలని తెలిపింది. ఉద్యోగులు, ఉపాధ్యాయులకు పెండింగ్‌లో ఉన్న ఐదు డీఏలు, జీపీఎఫ్, జీఎల్ఐ, సప్లిమెంటరీ వేతనాలు, సరెండర్ లీవులు, ఉద్యోగ విరమణ పొందినవారికి పెన్షనరీ బెనిఫిట్స్ ఖాతాల్లో జమచేయాలని డిమాండ్ చేసింది.

రాష్ట్ర ప్రభుత్వం రైతులకు ప్రకటించిన రూ.రెండు లక్షల రుణమాఫీని అర్హులైనవారందరికీ అమలు చేయాలని సిపిఎం కోరింది. ప్రస్తుతం 42 లక్షల మంది బాకీపడి ఉండగా, 22 లక్షల మందికి రూ.18 వేల కోట్లు మాత్రమే మాఫీ చేసిందని తెలిపింది. మిగిలిన 20 లక్షల మంది రైతులకు కూడా రుణమాఫీ చేయాలని పేర్కొంది. పంటకాలం పూర్తవుతున్నప్పటికీ వానాకాలం రైతుభరోసా ఇవ్వలేదని ఆందోళన వ్యక్తం చేసింది. రైతు భరోసాను తక్షణమే చెల్లించాలని డిమాండ్ చేసింది. కౌలురైతులకు చట్టపరమైన హక్కులు కల్పించి "రుణ గుర్తింపు కార్డు"లను ఇవ్వాలని సూచించింది. కాంగ్రెస్ మ్యానిఫెస్టోలో చెప్పినట్టు కౌలురైతులు, వ్యవసాయ కార్మికులకు రూ.12 వేలు ఇవ్వాలని కోరింది.

గ్రూప్-1 అభ్యర్థులకు న్యాయం చేసేవిధంగా ప్రభుత్వం తగు నిర్ణయం తీసుకోవాలనీ, అభ్యర్థులపై పెట్టిన కేసులను ఉపసంహరించుకోవాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని సిపిఎం డిమాండ్ చేసింది. గ్రామీణ ప్రాంతాల్లో ఉపాధి హామీ పథకానికి కేంద్రం నిధులతోపాటు, రాష్ట్రం నిధులు కేటాయించి గ్రామీణ పేదలకు, వ్యవసాయ కార్మికులకు ఉపాధి కల్పించాలని తెలిపింది. ఉపాధి హామీ పథకం కింద రోజుకు రూ.600 కూలి ఇస్తూ, ఏడాదికి 200 పనిదినాలను కల్పించాలని కోరింది. పనిచేసిన వారికి బకాయిలు పెట్టకుండా వెంటవెంటనే చెల్లించాలని పేర్కొంది. యాంత్రీకరణ పేరుతో ఉపాధి హామి నిధుల్లో 45 శాతం కేటాయిస్తున్నారని తెలిపింది. దీన్ని తగ్గించి కూలీల ద్వారా పనిచేయించాలని సూచించింది. వ్యవసాయ కార్మికులకు కనీస వేతనాలను నిర్ణయించాలనీ, రోజుకు రూ.700 కూలి నిర్ణయించి అమలు చేయాలని తెలిపింది. ప్రభుత్వం ప్రకటించిన నాలుగు లక్షల ఇండ్లు పేదలకు ఇండ్ల స్థలాల పట్టాలిచ్చి, ఇండ్ల నిర్మాణానికి రూ.10 లక్షలు సబ్సిడీగా ఇవ్వాలని కోరింది. అర్హులైన జర్నలిస్టులకు ఇండ్ల స్థలాలు ఇవ్వాలని డిమాండ్ చేసింది. ఈ సమస్యల పరిష్కారం కోసం ఇప్పటికే ఆయా రంగాల ప్రజలు పోరాడుతున్నారనీ, రాష్ట్ర ప్రభుత్వం తక్షణమే వాటిని పరిష్కరించాలని కోరింది..

IN THE COURT OF THE HON'BLE V ADDL DISTRICT JUDGE
RANGA REDDY DISTRICT: AT: L.B.NAGAR
O.S.No. 147 OF 2024

Between:
Madagoni Ramesh ...Plaintiff
AND
Sri. Jakkidi Raghuveer Reddy & 3 others ...Defendants

To
1. Smt.Jakkidi Anuradha W/o. J.Malla Reddy Aged about 53 years, Occ: Business
2. Smt.Jakkidi Bindhu D/o. J.Malla Reddy Aged about 32 years, Occ: Business
Both are resident o H.No.3-9-105, Central Bank Colony, L.B.Nagar, Mansoorabad, Ranga Reddy District.

The above named plaintiff have filed the above suit for CANCELLATION of Regd. Development Agreement cum General power of Attorney bearing Doc.No.2860/2020, dt: 10.08.2020 and the said matter is posted on 05.11.2024 for your appearance. You are therefore hereby directed to appear on the above said date at 10.30 am either in person or through your counsel, failing which the matter will be decided in your absence as proper law.

// BY ORDER OF COURT//
M/s. T. Bhaskar Reddy
Advocate
#Flat No. 103, Plot No.49 & 50, Blue Ridge Residency, Nagarjuna Nagar Colony, L.B.Nagar, Hyderabad - 500068
Cell No. 99480 94466

బ్యాంకు మేనేజర్ కుటుంబ సభ్యులను పరామర్శిస్తున్న కెటిఆర్

రాష్ట్రంలో క్షీణించిన శాంతిభద్రతలు

- వెంటనే హోంమంత్రిని నియమించండి : కెటిఆర్

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

తెలంగాణలో శాంతిభద్రతలు క్షీణించాయని బిఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, ఎమ్మెల్యే కెటిఆర్ అన్నారు. ప్రభుత్వం పోలీసులను స్వేచ్ఛగా పనిచేయనివ్వడంలేదని ఆరోపించారు. వారికి స్వేచ్ఛనిచ్చి వాళ్ల పని వాళ్లని చేసుకోనివ్వాలన్నారు. రాష్ట్రంలో వెంటనే హోంమంత్రిని నియమించాలని డిమాండ్ చేశారు. హైదరాబాద్ బాగ్ అంబర్‌పేట సాయిబాబానగర్ కాలనీలో ఇటీవల హత్యకు గురైన రిటైర్డ్ బ్యాంకు మేనేజర్ పి.లింగారెడ్డి దంపతుల ఇంటికి ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్, కార్పొరేటర్ బి. పద్మవెంకటరెడ్డి, విజయ్ కుమార్ గౌడ్‌తో కలిసి వెళ్లి వారి కుటుంబ సభ్యులను ఆయన పరామర్శించారు. అనంతరం కేటీఆర్ మీడియాతో మాట్లాడుతూ.. లింగారెడ్డి, ఊర్మిళ అనే వృద్ధ దంపతులను పట్టపగలు వారి ఇంటిపై దాడి చేసి కిరాతకంగా హత్య చేశారన్నారు. లింగారెడ్డి ముగ్గురు కుమార్తెలు అమెరికాలో ఉన్నారు. హైదరాబాద్ లాంటి ప్రశాంతమైన నగరంలో ఇలాంటి సంఘటన జరగటంతో వారంతా షాక్‌లో ఉన్నారని తెలిపారు. తమ ఎమ్మెల్యే కాలేరు వెంకటేశ్ స్వయంగా వచ్చి కుటుంబ సభ్యులను పరామర్శించి విషయాన్ని తన దృష్టికి తీసుకురావడంతో వారి కుటుంబానికి ధైర్యం చెప్పేందుకే ఇక్కడకు వచ్చినట్టు చెప్పారు. జంట హత్యలకు పాల్పడిన నిందితులను వీలైనంత త్వరగా అరెస్టు చేసి ప్రజల ముందుంచాలని కోరారు.

ఈ జంట హత్య కేసులో ఇప్పటి వరకు ఎలాంటి పురోగతి లేదన్నారు. ఇన్‌స్పెక్టర్‌ను అడిగితే ఒక కొలిక్కి వచ్చిందని చెబుతున్నారన్నారు. రాష్ట్రంలో శాంతి భద్రతలు అదుపులో లేవని, దారుణమైన పరిస్థితులు ఉన్నాయంటూ స్వయంగా కాంగ్రెస్ సీనియర్ నేత, ఎమ్మెల్సీ జీవన్ రెడ్డి చెప్పారని గుర్తు చేశారు. జగిత్యాలలో జీవన్ రెడ్డి అనుచరుడిని హత్య చేశారని అన్నారు. ఇక్కడ వృద్ధ జంటను హత్య చేశారని, దాంతో హైదరాబాద్‌లో ప్రజలు భయంతో ఉన్నారని చెప్పారు. శాంతిభద్రతలు అదుపులో ఉంచేందుకు చర్యలు తీసుకోవాలని నగర సీపీ, డీజీపీలనుకోరుతున్నానన్నారు. పోలీసు అధికారులను తమ పైకి.. అశోక్ నగర్‌లో పిల్లల పైకి ఉసికొల్పకుండా శాంతిభద్రతలు కల్పించాలన్నారు. ప్రజలకు ధైర్యం చెప్పాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందని.. సరైన విధంగా శాంతిభద్రతలు మెయింటెన్ చేయాల్సిన బాధ్యత సీఎంపై ఉందని తెలిపారు. అది చేయకుండా పోలీసులను అడ్డం పెట్టుకొని ఎవరి మీద కేసులు పెట్టించాలా? ఎవరెంబడి ఎట్ల పడాలా? ఎవరిని ఎట్లా వేధించాలా? ఇది మాత్రమే ఎజెండాగా పెట్టుకొంటే శాంతిభద్రతలు ఖచ్చితంగా దెబ్బతింటాయని అన్నారు. స్థానికంగా ఉన్న సీసీ కెమెరాలు దెబ్బతిన్నాయని, వాటిని బాగుచేయిస్తానని తమ ఎమ్మెల్యే ముందుకు వచ్చారని తెలిపారు. తాము పది లక్షల సీసీ కెమెరాలు నగరంలో ఏర్పాటు చేశామని, అవి పనిచేయకపోతే ప్రభుత్వం బాగుచేయించాలని, ప్రభుత్వం పట్టించుకోకపోతే తాము వాటికి మరమ్మతులు చేయిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో సీనియర్ నాయకులు ముఠా జయసింహ, డాక్టర్ శిరీష ఓం ప్రకాష్ యాదవ్,, డివిజన్ అధ్యక్షులు చంద్రమోహన్,సిద్ధార్థ ముదిరాజ్,ఎర్ర భీష్మ దేవ్, తదితర నాయకులు పాల్గొన్నారు.

బండి సంజయ్‌కు కెటిఆర్ లీగల్ నోటీసు

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

కేంద్ర మంత్రి బండి సంజయ్ తనపై నిరాధారమైన, తన పరువుకు నష్టం కలిగించేలా వ్యాఖ్యలు చేశారంటూ ఆయనకు కెటిఆర్ లీగల్ నోటీసులు పంపారు. తనపై చేసిన నిరాధారమైన వ్యాఖ్యలకు వారం రోజుల్లోగా బేషరతుగా క్షమాపణలు చెప్పకపోతే పరువు నష్టం దావా వేస్తానని హెచ్చరించారు. ఈ నెల 19న బండి సంజయ్ మీడియాతో మాట్లాడుతూ తనపై తప్పుడు ఆరోపణలు చేశారని కేటీఆర్ నోటీసులో పేర్కొన్నారు. కేటీఆర్ డ్రగ్స్ తీసుకుంటాడనీ, బీఆర్ఎస్ అధికారంలో ఉన్నప్పుడు ఫోన్ ట్యాపింగ్‌కు పాల్పడ్డాడని బండి సంజయ్ ఆరోపణలు చేశారు. దీనిపై కేటీఆర్ ఆగ్రహం వ్యక్తం చేస్తూ బండి సంజయ్ చేసిన నిరాధరమైన కామెంట్లను నోటీసులో పేర్కొన్నారు. ఫోన్ ట్యాపింగ్ విషయంలో తన తండ్రి కేసీఆర్ పేరును కూడా తీశారని చెప్పారు. బండి సంజయ్ చేసిన వ్యాఖ్యలు తన వ్యక్తిత్వాన్ని అవమానపరిచేలా, ప్రతిష్టను దిగజార్చేలా ఉన్నాయని నోటీసులో తెలిపారు. కేవలం తనను అప్రతిష్ట పాలు చేయాలన్న దురుద్దేశతంతోనే బండి సంజయ్ ఇలాంటి వ్యాఖ్యలు చేశారన్నారు. తాను డ్రగ్స్ తీసుకుంటాననీ, ఫోన్ ట్యాపింగ్ చేశాననీ, కేసుల నుంచి తప్పించుకోవటానికి ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డితో రహస్యంగా కలిసిపోయానంటూ బండి సంజయ్ చేసిన వ్యాఖ్యలను నిరూపించాలని కేటీఆర్ సవాల్ విసిరారు. ఎలాంటి ఆధారాలు లేకుండా ఇష్టానుసారంగా తన పరువుకు భంగం కలిగించే వ్యాఖ్యలు చేస్తే చట్టపరమైన చర్యలు తప్పవని హెచ్చరించారు. బండి సంజయ్ చేసిన వ్యాఖ్యలు విస్తృతంగా మీడియా, సోషల్ మీడియా ద్వారా ప్రచారం చేయబడ్డాయనీ, దీని కారణంగా ప్రజలు తనను తప్పుగా అర్థం చేసుకునే ప్రమాదం ఉందని కేటీఆర్ అన్నారు. ఫోన్ ట్యాపింగ్ సహా డ్రగ్స్ ఆరోపణలను కేటీఆర్ తీవ్రంగా ఖండించారు. వాటిన్నింటిని ఉద్దేశపూర్వకంగా కల్పించిన కట్టుకథలుగా కొట్టిపారేశారు. కేంద్రమంత్రిగా బాధ్యతయుతమైన పదవిలో ఉన్న బండి సంజయ్ లాంటి వ్యక్తి చేసే ఆరోపణలను ప్రజలు నమ్మే పరిస్థితి ఉంటుందన్నారు. ఎలాంటి ఆధారాలు లేకుండా కేవలం తనపై బురద చల్లాలన్న దురుద్దేశం, తమ పార్టీ రాజకీయ ఎజెండాను ముందుకు తీసుకెళ్లాలనే ఇలాంటి ఆరోపణలు చేస్తున్నారని కేటీఆర్ నోటీసులో తెలిపారు. ఐదుసార్లు ఎమ్మెల్యేగా, తొమ్మిదేండ్లు రాష్ట్ర మంత్రి గా తెలంగాణ ప్రయోజనాల కోసం కృషి చేసిన తనను ఉద్దేశపూర్వకంగా బద్నాం చేసే కార్యక్రమం పెట్టుకున్నారని చెప్పారు. గతంలోనూ బండి సంజయ్ తనపై ఇలాంటి వ్యాఖ్యలే చేశారని గుర్తుచేశారు. రాజకీయంగా తనను ఎదుర్కొనే శక్తి లేకనే తన వ్యక్తిత్వంపై బురదచల్లే ప్రయత్నం గత కొన్ని సంవత్సరాలు చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. పదే పదే ఇలాంటి ఆరోపణలు చేయటం ద్వారా ప్రజల్లో తన ప్రతిష్టను నాశనం చేయాలనే కుట్ర తప్ప వారి ఆరోపణల్లో నిజం లేదని కొట్టిపారేశారు. బండి సంజయ్ తన వ్యాఖ్యలను వెంటనే ఉపసంహరించుకోవాలని కేటీఆర్ నోటీసులో పేర్కొన్నారు. అసత్య ప్రచారం చేసినందుకు బహిరంగ క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. వారం రోజుల్లోగా క్షమాపణలు చెప్పకుంటే పరువు నష్టం దావా, క్రిమినల్ ప్రొసీడింగ్స్‌ను ఎదుర్కోవాల్సి హెచ్చరించారు.

यूनियन बैंक ऑफ इंडिया Union Bank of India
రాజేశ్వరినగర్ బ్రాంచి (25261), లలితానగర్ కాలనీ, రాజేశ్వరినగర్, గైగోల్పాడు జంక్షన్, కాకినాడ

డిమాండ్ నోటీసు

టు:
ఋణగ్రహీత : శ్రీ కె ఫణి సాయి అయ్యప్ప రఘుతేజ కెర్ ఆఫ్ కె వీర్రాజు, డి.నెం. 2 4 712 1, ఫ్లాట్ నెం. 17, కొత్త నగోల్ హయత్‌నగర్, రాంగరెడ్డి, తెలంగాణ - 500068. 2. కో-అప్లికెంట్: శ్రీమతి సి హెచ్ సీతా రమణ సుభాషిణి భర్త: కె వీర్రాజు, ఫ్లాట్ నెం. 23, 1వ అంతస్తు రోడ్ నెం 7 నగర్, కొత్త నగోల్ కొత్తపేట్, సరూర్‌నగర్, రాంగరెడ్డి, తెలంగాణ - 500035.

అమ్మా/అయ్యా,

విషయం: ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫ్ సెక్యూరిటీ ఇంట్రెస్ట్ చట్టము అమలు నోటీసు - మీరు మా నుండి పొందిన ఋణసౌకర్యములకు సంబంధించి నిరర్ధక ఆస్తులుగా వర్గీకరణ. మా యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా,రాజేశ్వరినగర్ బ్రాంచ్ నుండి దిగువ రుణసదుపాయాలను ఇందులో చిరునామాదారు నెం.1 మరియు వ.నెం.2 ఋణగ్రహీత మరియు కో-అప్లికెంట్ /హామీదారు లు మీరు వినియోగించుకున్నారు మరియు బకాయి/ వాయిదా / వడ్డీ తిరిగి చెల్లించుటలో విఫలమైనందున/ సదరు ఖాతాలు సంతృప్తికరంగా నిర్వహించ నందున ఇన్‌కమ్ రికగ్నిషన్ అండ్ ప్రుడెన్షియల్ అకౌంటింగ్ షరతుల ప్రకారం ఆర్‌బిఐ మార్గదర్శకాల ననుసరించి మీ ఖాతా/లు 30.09.2024 నాటికి నిరర్థక ఆస్తిగా వర్గీకరించబడినవి. తేది.30.09.2024 నాటికి రూ. 34,63,449/- (అక్షరాల ముప్పై నాలుగు లక్షల అరవై మూడు వేల నాలుగు వందల నాలభై తొమ్మిది రూపాయలు మాత్రమే) మీ ఖాతా/లలో బకాయిగా ఉన్నది.

పైన పేర్కొన్న ఖాతా/లకు సంబంధించి మీ నుండి బ్యాంకుకు చెల్లించాల్సిన మొత్తం వివరాలు క్రింది విధంగా ఉన్నాయి.

Nature of limits	Limit amount (in Rupees)	Applicable Rate of Interest (% p.a.)	Outstanding Amount (In Rupees)
Housing Loan	Rs.35,00,000.00	9.10 %	Rs. 34,63,449.00

సదరు బకాయిసొమ్ములు లేదా సొమ్ములు తిరిగి చెల్లింపుల కొరకు సెక్యూర్డ్ చేసేందుకు దిగువ ఇందులో వివరించిన స్థిరాస్తికి సెక్యూరిటీ ఇంటరెస్ట్ కల్పించి మరియు శ్రీ కె ఫణి సాయి అయ్యప్ప రఘుతేజ & శ్రీమతి సి హెచ్ సీతా రమణ సుభాషిణిగారిచే డాక్యుమెంట్లు బ్యాంక్ బకాయి నిమిత్తం అమలు చేయబడినవి. మిమ్మల్ని పలుమార్లు డిమాండు చేసినప్పటికీ మీ ఖాతాలోనిబకాయి సొమ్ముకు సంబంధించి మీరు ఎట్టి చెల్లింపు జరపలేదు/ మీ ఋణాలను మీరు చెల్లించలేదు.మేము అనేక మార్లు విన్నపములు చేసినప్పటికీ, మీరు మీ ఖాతాలోని బకాయి మొత్తము రూ. 34,63,449/- (అక్షరాల ముప్పై నాలుగు లక్షల అరవై మూడు వేల నాలుగు వందల నాలభై తొమ్మిది రూపాయలు మాత్రమే) మరియు కాంట్రాక్ట్యువల్ రేటు ప్రకారము జమకూడు వడ్డీ ను చెల్లించలేదు/ మీ ఋణములను తీర్చలేదు. అందువలన సెక్యూరిటైజేషన్ అండ్ రీకన్‌స్ట్రక్షన్ ఆఫ్ ఫైనాన్షియల్ అస్సెట్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫ్ సెక్యూరిటీ ఇంటరెస్ట్ యాక్ట్, 2002 యొక్క సెక్షన్ 13(2) ప్రకారము మీ యొక్క బకాయి మరియు ఋణపత్రములో చెప్పబడిన నియమ నిబంధనలలోనున్న ఒప్పందపు రేటు ప్రకారము నెలవారీ వడ్డీతో సహా ఈ నోటీసు అందిన 60 రోజులలోగా చెల్లించవలసి ఉంటుందని, అట్లు చేయుటలో విఫలమైనచో మీరు మా బ్యాంకుకు హామీ ఇచ్చిన ఆస్తులపై సదరు చట్టం ప్రకారం లభించు ఏవేని లేదా అన్ని హక్కులను ప్రయోగించవలసి ఉంటుందని తెలియజేయడమైనది.

సెక్యూరిటీ వివరములు

తూర్పు గోదావరి జిల్లా (ప్రస్తుతము కాకినాడ జిల్లా) , సర్పవరం యస్ఆర్ఓ, వాకలపూడి గ్రామము, కాకినాడ మండలం, యస్.నెం.46/3, యల్ పి నెం. 86/85, అసెన్‌మెంట్ నెం. 1446 ఫ్లాట్ నెం.5, (పాత) డి.నెం.3-29 (కొత్త) డి.నెం.3-148 లో 350 చ॥గ॥ లేద 292.65 చ॥మీ॥ శ్రీమతి సి హెచ్ సీతా రమణ సుభాషిణిగారికి చెందిన ఆర్‌సిసి డాబా ఇల్లుకు మరియు స్థలమునకు సంబందించిన యావదాస్తి. ఈ దిగువ హద్దులలో: తూర్పు : సన్నిధిరాజు శివశంకర్ కాంపౌండ్ వాల్ స్థలం-ఫ్లాట్ నెం 12 , పడమర : దువ్వూరి వెంకట సుబ్రహ్మణ్య శాస్త్రి గారి ఫ్లాట్ నెం 4 లో స్థలము, ఉత్తరం : రోడ్డు, దక్షిణం :జి రాధా కృష్ణ కాంపౌండ్ వాల్ స్థలం- ఫ్లాట్ నెం 2.

మీరు సదరు బకాయిలను 60రోజులలోగా తిరిగి చెల్లించుటలో విఫలమైనచో, బ్యాంకు వారు సదరు చట్టం ప్రకారం లభించిన హక్కులన్నింటిని ఉపయోగించిననూ హామీ ఇవ్వబడిన ఆస్తుల విక్రయముతో బకాయిలు పూర్తిగా చెల్లించబడనప్పుడు, మిగిలిన బకాయి సొమ్ము మీ నుండి రాబట్టుకొనుటకు, న్యాయస్థానము/ డెట్స్‌రికవరీ ట్రిబ్యునల్ వారి సమక్షములో తగు న్యాయపరమైన చర్యలు తీసుకోవలసి ఉంటుంది.

సదర చట్టం యొక్క 13(13) ప్రకారము, ఈ నోటీసు పొందిన అనంతరం మీరు పైన చెప్పబడిన ఆస్తులను సాధారణ వ్యాపార కార్యకలాపాలు చేయుటకు తప్ప బ్యాంకు వారి అనుమతి లేకుండా ఉపయోగించరాదు మరియు విక్రయించరాదు/లావాదేవీలు జరుపరాదు. సదరు చట్టం యొక్క ఏ విధమైన అతిక్రమణలు జరిపినా తీవ్ర పరిణామాలకు దారి తీస్తుందని గమనించగలరు.

చట్టంలోని సెక్షన్ 13మొక్క సబ్ సెక్షన్(8)లోని నిబంధనల క్రింద ప్రజల నుండి కొటేషన్లు లేదా టెండర్లును కోరడం లేదా లీజు, అసైన్‌మెంట్ ద్వారా బదిలీ కొరకు ప్రైవేట్ ఒప్పందం, బహిరంగ వేలం ద్వారా సెక్యూర్ట్ ఆస్తులను విక్రయించడం కొరకు ప్రకటన ప్రచురణ తేదీలోపు బ్యాంకు అయిన అన్ని వ్యయాలు, ఛార్జీలు మరియు ఖర్చులతో పాటు పూర్తి బకాయి మొత్తమును చెల్లించి మీరు సెక్యూర్డ్ ఆస్తులను విడిపించుకునే హక్కును పొందవచ్చునని గమనించగలరు.

తేది : 01.10.2024
ప్రదేశం : కాకినాడ
సం/- ఛీఫ్ మేనేజర్ & అధీకృత అధికారి

ఎఇఒలను సస్పెండ్ చేయడం సరికాదు

- మాజీ మంత్రి హరీశ్‌రావు

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

డిజిటల్ సర్వేకు ఒప్పుకోలేదన్న కారణంతో 163 మంది ఎఇఒలను సస్పెండ్ చేయడాన్ని మాజీ మంత్రి తన్నీరు హరీశ్‌రావు తీవ్రంగా ఖండించారు. మహారాష్ట్ర, ఒడిశా, కర్ణాటక రాష్ట్రాల్లో ప్రయివేటు కంపెనీలు, ఔట్ సోర్సింగ్ సిబ్బంది ద్వారా డిజిటల్ సర్వే చేయిస్తుంటే, తెలంగాణలో ఏఈవోలపై అదనపు భారాన్ని మోపుతూ వేధింపులకు గురిచేయడం దుర్మార్గమని బుధవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. సస్పెండ్ చేసిన 163 ఏఈవోలను వెంటనే విధుల్లోకి తీసుకోవాలని డిమాండ్ చేశారు. డిజిటల్ సర్వే ఏఈవోలకు భారం కాకుండా చూడాలని ఆయన ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

ఉద్యోగోన్నతులు పారదర్శకంగా నిర్వహించండి

- డిహెచ్‌కు ప్రభుత్వ నర్సెస్ అసోసియేషన్ వినతి

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

సీనియర్ నర్సింగ్ ఆఫీసర్ల ఉద్యోగోన్నతుల కోసం సీనియార్టీ జాబితా ప్రకటించి పారదర్శకంగా నిర్వహించాలని తెలంగాణ (ప్రభుత్వ) నర్సెస్ అసోసియేషన్ రాష్ట్ర ప్రజారోగ్య సంచాలకులు డాక్టర్ రవీందర్ నాయక్‌ను కోరింది. ఈ మేరకు బుధవారం కోఠిలోని ఆయన కార్యాలయంలో అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి మరియమ్మ, జాయింట్ సెక్రెటరీ లక్ష్మణ్ రుఢావత్, నర్సింగ్ ఆఫీసర్లు గీతాంజలి, భవాని, శిరీష కలిసి వినతిపత్రం అందజేశారు. కొత్త మెడికల్ కాలేజీల్లో కూడా సీనియర్ నర్సింగ్ ఆఫీసర్ల పోస్టులను ప్రమోషన్ ద్వారా భర్తీ చేయాలని విజ్ఞప్తి చేశారు.

రెండు రోజుల్లో రాష్ట్రంలో రాజకీయ సునామి

- మంత్రి పొంగులేటి

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

దీపావళి రాకముందే రాష్ట్ర రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి రాజకీయ సంచలనాలు సృష్టించే పొలిటికల్ బాంబ్‌లను పేల్చేశారు. సియోల్‌లో హన్ నది పునరుజ్జీవన పరిస్థితులను అధ్యయనం చేయడానికి వెళ్లిన మంత్రి అక్కడ ఓ తెలుగు జాతీయ ఛానల్ ప్రతినిధికి ఇచ్చిన ప్రత్యేక ఇంటర్వ్యూలో సంచలన వ్యాఖ్యలు చేశారు. ఫోన్ ట్యాపింగ్, కాళేశ్వరం ప్రాజెక్ట్, ధరణి మొదలగు ఎనిమిది అంశాలపై చర్యలు ఉంటాయన్నాని చెప్పారు. దీనికి సంబంధించి పూర్తి సాక్ష్యాధారాలు సిద్ధమయ్యాయని అన్నారు. సియోల్ నుంచి మరో రెండు రోజుల్లో హైదరాబాద్ చేరే సరికల్లా చర్యలు ప్రారంభమయ్యే అవకాశాలున్నాయని పేర్కొన్నారు. కక్ష సాధింపుకు పాల్పడటం లేదనీ, చట్ట ప్రకారం ఆధారాలతో చర్యలు తీసుకోనున్నామని చెప్పారు. ఇందులో ఎంతటివారున్నా ఉపేక్షించేది లేదని తేల్చి చెప్పారు.

త్వరలోనే సభ్యత్వ నమోదు

- తెలంగాణ ప్రభుత్వ వైద్యుల సంఘం

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

త్వరలోనే సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని చేపట్టనున్నట్టు తెలంగాణ ప్రభుత్వ వైద్యుల సంఘం తెలిపింది. బుధవారం ఆ సంఘం సెంట్రల్ ఎగ్జిక్యూటివ్ కమిటీ తొలి సమావేశాన్ని హైదరాబాద్‌లోని కోఠిలో ఉన్న రాష్ట్ర కార్యాలయంలో నిర్వహించింది. ఈ సందర్భంగా రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు డాక్టర్ నరహరి, డాక్టర్ లాలు ప్రసాద్ రాథోడ్ మాట్లాడుతూ వైద్యభవన్‌ను పునరుద్ధరించి త్వరలోనే అందుబాటులోకి తేనున్నట్టు తెలిపారు. సర్వీస్ రూల్స్‌కు వ్యతిరేకంగా ఆయుష్మాన్ ఆరోగ్య మందిరాల్లో స్పెషలిస్ట్ వైద్యులను డీఎంఈ, వీవీపీ నుంచి పోస్ట్ చేస్తూ ఆదేశాలు జారీ చేయడాన్ని వ్యతిరేకించారు. సమావేశంలో డీఎంఈ, డీహెచ్, వీవీపీ, ఈఎస్ఐ ప్రభుత్వ వైద్యుల పెండింగ్ సమస్యల పరిష్కారం కోసం ప్రభుత్వానికి వినతి పత్రం ఇవ్వాలని తీర్మానించారు. అనంతరం పదవీ బాధ్యతలు స్వీకరించిన నాయకులను సన్మానించారు.

మైక్రోఫైనాన్స్ ఉచ్చులో మహిళలు

- ప్రభుత్వమే రుణసౌకర్యం కల్పించాలి..
- బిజెపి హయాంలో స్త్రీలపై దాడులు తీవ్రతరం
- ఐద్వా మహాసభలో ఐదు తీర్మానాలు..
- కర్తవ్యాల అమలు కోసం ఉద్యమాలు
- ఐద్వా నేతలు మరియం ధావలే, పుణ్యవతి

విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న మల్లు లక్ష్మి

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

మైక్రోఫైనాన్స్ ఉచ్చులో చిక్కుకొని మహిళలు, యువత అవస్థలు పడుతున్నారని ఐద్వా జాతీయ ప్రధాన కార్యదర్శి మరియం ధావలే ఆందోళన వ్యక్తం చేశారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల విధానాల ఫలితంగా మహిళలు ఎదుర్కొంటున్న అనేక సమస్యలపై రాష్ట్ర మహాసభల్లో చర్చించామన్నారు. భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలోని మహాసభల నిర్వహణ వేదిక కొత్తగూడెం క్లబ్‌లో బుధవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో జాతీయ అధ్యక్షులు శ్రీమతి, కోశాధికారి ఎస్.పుణ్యవతి, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మల్లు లక్ష్మితో కలిసి ఆమె మాట్లాడారు. నిత్యావసర వస్తువుల ధరల పెరుగుదల, నిరుద్యోగిత, మహిళల సమస్యలన్నింటిపై ఈ మహాసభల్లో చర్చించినట్టు తెలిపారు. కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం, రాష్ట్రంలోని కాంగ్రెస్ ప్రభుత్వ విధానాలతో మహిళలు ఏ విధమైన సమస్యలు ఎదుర్కొంటున్నారో కూడా చర్చించినట్టు చెప్పారు. అసెంబ్లీ ఎన్నికల సమయంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీలు సరిగా అమలు కావడంలేదన్నారు. ప్రజా పంపిణీ వ్యవస్థ మెరుగుపడకపోగా నిరుద్యోగిత, మహిళలపై హింస పెరుగుతోందన్నారు. రాష్ట్రంలో మహిళలపై మైక్రో ఫైనాన్స్ సంస్థల వేధింపులు అధికమయ్యాయని చెప్పారు. వీటి నుంచి మహిళలకు విముక్తి కలిగించేలా రాష్ట్ర ప్రభుత్వం ఆలోచన చేయాలని కోరారు. ఆర్థికంగా వెనుకబడిన ప్రజలు మైక్రోఫైనాన్స్ సంస్థల వైపు మళ్లకుండా ప్రభుత్వమే రుణ సౌకర్యం కల్పించాలని డిమాండ్ చేశారు.

ప్రభుత్వాల వైఫల్యంతోనే మహిళలపై దాడులు: ఎస్.పుణ్యవతి

ప్రభుత్వాల వైఫల్యంతోనే మహిళలపై దాడులు పెరుగుతున్నాయని ఐద్వా జాతీయ కోశాధికారి ఎస్.పుణ్యవతి ఆరోపించారు. ఈ మహాసభల్లో స్త్రీలపై జరుగుతున్న లైంగికదాడులపై రిపోర్టులు అధికంగా వచ్చాయని, బాధితులకు అండగా నిలవడంలో ఐద్వా ముందుందన్నారు. సాధారణ స్త్రీలు బాధిత మహిళలకు తోడుగా ఉంటున్నప్పుడు ప్రభుత్వాలకు ఆపాటి బాధ్యత లేదా? అని ప్రశ్నించారు. స్త్రీలపై జరుగుతున్న దాడులకు వ్యతిరేకంగా పెద్ద ఎత్తున క్యాంపెయిన్ నిర్వహించాలని కోరారు. రేవంత్‌రెడ్డి ముఖ్యమంత్రి అయ్యి దాదాపు ఏడాది అవుతుందని, ఇప్పటి వరకు ఎన్ని ఉద్యోగాలు భర్తీ చేశారని ప్రశ్నించారు. ఇటీవల బీటెక్ యువకుడు ఉరివేసుకొని చనిపోయాడని, నిరుద్యోగిత, లోన్ యాప్‌లు నిర్వాహకుల వేధింపులే కారణమని విశ్లేషించారు. ఇలాంటి చావులను అరికట్టే బాధ్యత ప్రభుత్వానికి లేదా అని ప్రశ్నించారు. రాష్ట్రంలో 8 లక్షల కుటుంబాలకు రేషన్‌కార్డులు లేవన్నారు. ఇలాంటి సమస్యలను ప్రభుత్వం పరిష్కారం చేయాలని, లేనిపక్షంలో ఉద్యమాలు చేస్తామని హెచ్చరించారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో 1974లో మొదటి రాష్ట్ర మహాసభలకు వేదికైన ఉమ్మడి ఖమ్మం జిల్లాలో తిరిగి 2024లో తెలంగాణ రాష్ట్ర 4వ మహాసభలు కొత్తగూడెంలో నిర్వహించడం విశేషమన్నారు. నాటి సభలను ఏలూరి జయమ్మ, కొండపల్లి దుర్గమ్మ, స్వరాజ్యేశ్వరమ్మ నాయకత్వంలో నిర్వహించారని గుర్తు చేశారు. నాటి నుంచి నేటి వరకు స్త్రీల సమానహక్కుల కోసం ఐద్వా పోరాటం చేస్తోందన్నారు. సారా వ్యతిరేక, అక్షరాస్యత ఉద్యమాల వంటివెన్నో చేసిందన్నారు.

హామీల అమల్లో కేంద్ర, రాష్ట్రాలు విఫలం : మల్లు లక్ష్మి

హామీల అమలులో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు విఫలమయ్యాయని ఐద్వా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మల్లు లక్ష్మి అన్నారు. బీజేపీ అధికారంలోకి వచ్చాక పేదరికం, నిరుద్యోగం, ఆర్థిక అసమానతలు, నిత్యావసర వస్తువుల ధరలు, మహిళలపై దాడులు పెరిగాయని తెలిపారు. వీటిని అరికట్టడంలో కేంద్రప్రభుత్వం పూర్తిగా విఫలమైందన్నారు. రాష్ట్రంలో కాంగ్రెస్ అధికారంలోకి వచ్చినా ఇచ్చిన హామీల అమల్లో చిత్తశుద్ధి లేదన్నారు. ఆరు గ్యారంటీల్లో మహిళలకు ఉచిత బస్సు సౌకర్యాన్ని కల్పించడాన్ని ఐద్వా స్వాగతిస్తోందన్నారు. మహాలక్ష్మి పథకంలో భాగంగా ఇస్తామన్న రూ.2,500, వ్యవసాయ కార్మికులకు రూ.12వేలు అమలు చేయాలని 4వ మహాసభ డిమాండ్ చేసిందన్నారు. మహాసభ మరో ఐదు తీర్మానాలను కూడా చేసిందని తెలిపారు. మహిళలపై వివిధ రూపాల్లో పెరుగుతున్న హింసను అరికట్టాలని కోరారు. ఆహార సూచీలో భారతదేశం ప్రపంచంలో 107 స్థానంలో ఉందని, నిత్యావసర వస్తువుల ధరల పెంపుతో మహిళల్లో రక్తహీనత పెరుగుతోందని అన్నారు. ఆహారభద్రత చట్టాన్ని అమలు చేసి అందరికీ ఆహారం అందేలా కేంద్రం చర్యలు తీసుకోవాలని కోరారు. మహిళా సాధికరతలో భాగంగా చట్టసభల్లో స్త్రీలకు 33శాతం రిజర్వేషన్ వెంటనే అమలు చేయాలని డిమాండ్ చేశారు. అన్నిరంగాల్లో సమాన అవకాశాలు కల్పించాలని కోరారు. రాష్ట్రంలో అర్హత కలిగినవారందరికీ ఇండ్లు, ఇండ్లస్థలాలు ఇవ్వాలన్నారు. 125 గజాల ఇంటిస్థలం ఇచ్చి రాష్ట్ర ప్రభుత్వం గృహ నిర్మాణానికి రూ.5లక్షలు, కేంద్రం ప్రధానమంత్రి ఆవాస్ యోజన కింద రూ.10 లక్షలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. రాష్ట్రంలో మహిళా అక్షరాస్యత తక్కువగా ఉందన్నారు. పాఠశాలలు, హాస్టల్స్‌లో మెరుగైన సౌకర్యాలు కల్పించాలని కోరారు. ఈ సమావేశంలో ఐద్వా రాష్ట్ర అధ్యక్షురాలు అరుణజ్యోతి, కొత్తగూడెం జిల్లా కార్యదర్శి మందలపు జ్యోతి తదితరులు పాల్గొన్నారు.

ముగిసిన రాష్ట్ర మహాసభలు

ఐద్వా రాష్ట్ర 4వ మహాసభలు కొత్తగూడెంలో ముగిశాయి. ఈ నెల 21, 22, 23 తేదీల్లో జరిగాయి. 21వ తేదీన కొత్తగూడెంలో జరిగిన బహిరంగసభ జరిగింది. పెద్ద ఎత్తున మహిళలు హాజరయ్యారు. 22, 23న జరిగిన మహాసభల్లో గడిచిన మూడేండ్లలో ఉద్యమ ప్రస్తానంపై చర్చించి భవిష్యత్తు కర్తవ్యాలను రూపొందించుకున్నారు. అంతేకాదు, మహిళల సమస్యలపై పలు తీర్మాలను ఆమోదించారు. చివరి రోజు నూతన రాష్ట్ర కమిటీని ఎన్నుకున్నారు. కమిటీ సభ్యుల పేర్లను గురువారం అధికారికంగా వెల్లడించనున్నట్టు ఐద్వా తెలిపింది.

ఇఎస్ఐ మందులు ప్రయివేటుకు మళ్లింపు

- ప్రభుత్వ ఫార్మసిస్టుపై కేసు నమోదు
- రూ.4.87 లక్షల విలువైన మందులు సీజ్

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

ఇఎస్ఐలో పారదర్శకత లోపించడంతో ఉచిత మందులను దారి మళ్లిస్తున్నారు. డ్రగ్ కంట్రోల్ అధికారులు విశ్వసనీయ సమాచారం మేరకు కరీంనగర్‌లో చేసిన దాడిలో కార్మికుల ఆరోగ్యం కోసం ఉచితంగా ఇవ్వాల్సిన మందులను ప్రయివేటు మెడికల్ స్టోర్స్‌లో నిల్వ చేసినట్టు గుర్తించారు. కరీంనగర్ జిల్లా ఒస్మాన్ పుర, డోర్ నెంబర్ 4-1-67లో ఉన్న శ్రీ శ్రీనివాస మెడికల్ అండ్ జనరల్ స్టోర్స్‌లో ఈఎస్ఐ సప్లై నాట్ ఫర్ సేల్ అనే లేబుల్ కలిగిన రూ.4.87 లక్షల విలువైన ఐదు రకాల ఔషధాలను గుర్తించారు. వీటిలో యాంటీ బయాటిక్స్‌తో పాటు తదితర మందులున్నాయి. దీంతో విచారణ చేపట్టగా కుమురంభీం ఆసిఫాబాద్ జిల్లా సిర్పూర్ కాగజ్‌నగర్, ఎస్పీఎం కాలనీ ఈఎస్ఐ డిస్పెన్సరీలో ఫార్మసిస్టు గ్రేడ్-2 దునబోయిన మురళీ రావు చట్టవిరుద్ధ కార్యకలాపాలకు పాల్పడుతున్నట్టు గుర్తించారు. ఆయన కరీంనగర్‌లోని శ్రీనివాస మెడికల్ అండ్ జనరల్ స్టోర్స్ మేనేజింగ్ పాట్నర్ గంప కృష్ణకు చట్టవిరుద్ధంగా మళ్లిస్తున్నట్టు డ్రగ్ కంట్రోల్ అధికారులు తెలిపారు.

సికింద్రాబాద్ లో కాలం చెల్లిన మందులు

సికింద్రాబాద్, వారాసీగూడ, నామాల గుండులోని భార్గవి మెడికల్ స్టోర్స్‌లో కాలం చెల్లిన మందులను నిల్వ ఉంచినట్టు డ్రగ్ కంట్రోల్ అధికారులు గుర్తించారు. విశ్వసనీయ సమాచారం మేరకు చేసిన ఈ దాడుల్లో రూ.60 వేల విలువైన 54 రకాల ఔషధాలను స్వాధీనం చేసుకున్నారు. ఈ నెల 15 నుంచి 22 వరకు చేసిన దాడుల్లో రూ.9.15 లక్షల విలువైన నిల్వలను స్వాధీనం చేసుకున్నట్టు డ్రగ్ కంట్రోల్ అథారిటీ డైరెక్టర్ జనరల్ వీ.బీ.కమలాసన్ రెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు.

ఐడిబిఐ బ్యాంక్ 'విజిలెన్స్ అవర్‌నెస్' వాకథాన్

ప్రజాశక్తి - హైదరాబాద్

అక్టోబర్ 28 నుంచి నవంబర్ 3వరకు జరగనున్న కానున్న విజిలెన్స్ అవర్‌నెస్ వారోత్సవాల సందర్భంగా ఐడిబిఐ బ్యాంక్ జోనల్ ఆఫీసు ఉద్యోగులు హైదరాబాద్‌లో వాకథాన్‌ను నిర్వహించింది. అవినీతిరహిత సొసైటీపై అవగాహన పెంచడానికి ఎల్‌బి స్టేడియం చుట్టూ బుధవారం ఈ వాకథాన్ జరిగింది. ప్రజలు అన్ని వేళల ఆన్‌లైన్ మోసాల పట్ల అప్రమత్తంగా ఉండాలని ఈ సందర్భంగా జోనల్ హెడ్ అండ్ సిజిఎం శరత్ కుమార్ కామత్ సూచించారు. మెరుగైన సమాజం నిర్మాణం కోసం అందరూ పాటుపడాలన్నారు.

ఎఇఒలపై సస్పెన్స్ సరికాదు

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

అకారణంగా సస్పెండ్ చేసిన వ్యవసాయ విస్తరణ అధికారుల వెంటనే విధుల్లోకి తీసుకోవాలనీ, ఆ ఉత్తర్వులను ఎత్తేయాలని రాష్ట్ర టిఎన్‌జిఒ అధ్యక్షులు మారం జగదీశ్వర్, టిజిఒ అధ్యక్షులు ఎలూరి శ్రీనివాస్ ఆధ్వర్యంలో రాష్ట్ర టిఎఇఒల సంఘం అధ్యక్షులు శ్రీనివాస్‌గౌడ్, కార్యదర్శి సురేష్ రెడ్డి బుధవారం వ్యవసాయ శాఖ డైరెక్టర్‌కు వినతిపత్రం సమర్పించారు. డిజిటల్ క్రాఫ్ సర్వే (డిసిఎస్)లో ఉన్న సమస్యలను పరిష్కరించడంతోపాటు రాష్ట్రంలో ఉన్న ఎఇఒలను మానసిక ఒత్తిడికిలోనూ కాకుండా ఉండేందుకు అనుకూలమైన వాతావరణం కల్పించాలని కోరారు. దీనికి డైరెక్టర్ సానుకూలంగా స్పందించి సస్పెన్షన్ ఎత్తివేస్తామంటూ హామీ ఇచ్చారు. డిసిఎస్ విషయంలో అందరూ వెంటనే డౌన్లోడ్ చేసి పని మొదలు పెట్టాలని సూచించారు.

ఉద్యోగులకు డిఎలు ప్రకటించాలి

- ఇ-కుబేర్‌లో పెండింగ్ బిల్లులను చెల్లించాలి : సిఎంకు ఎమ్మెల్సీ నర్సిరెడ్డి లేఖ

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

రాష్ట్రంలోని ఉద్యోగులు, ఉపాధ్యాయులకు ఐదు విడతల డీఏలను ప్రకటించాలని ఎమ్మెల్సీ అలుగుబెల్లి నర్సిరెడ్డి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈనెల 26న జరిగే మంత్రివర్గ సమావేశంలో చర్చించి తగు నిర్ణయం తీసుకోవాలని కోరారు. ఈ మేరకు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి బుధవారం ఆయన లేఖ రాశారు. ఈ-కుబేర్‌లో ఉద్యోగులు, ఉపాధ్యాయులకు సంబంధించిన జిపిఎఫ్, టిజిజిఎల్ఐ, మెడికల్ రీయింబర్స్‌మెంట్, సరెండర్ లీవులు, లీవ్ సాలరీ, సప్లిమెంటరీ బిలులో చేసిన సాలరీలు వంటి బిల్లులు నెలల తరబడి పెండింగ్‌లో ఉన్నాయని తెలిపారు. ఈ ఏడాది మార్చి నుంచి రిటైర్ అయిన ఉద్యోగుల చెల్లింపులు కూడా పెండింగ్‌లో ఉన్నాయని పేర్కొన్నారు. ఇ-కుబేర్‌లో పెండింగ్‌లో వివిధ రకాల బిల్లుల చెల్లింపులకు క్రమపద్ధతి ప్రకారం డిసెంబర్‌లోగా చెల్లించేందుకు తగు నిర్ణయం తీసుకోవాలని సూచించారు. కెజిబివిల్లో పనిచేస్తున్న కాంట్రాక్టు ఉపాధ్యాయుల జీతాలు చాలా తక్కువగా ఉన్నాయని తెలిపారు. రెగ్యులర్ ఉపాధ్యాయులకిస్తున్న వేతన స్కేలులో మినిమం బేసిక్ పేను వర్తింపచేసేందుకు తగు నిర్ణయం తీసుకోవాలని కోరారు. కాంట్రాక్టు, ఔట్‌సోర్సింగ్‌లో పని చేస్తున్న ఉపాధ్యాయులు, ఉద్యోగులకు ప్రతిఏటా కొంత జీతం పెంచాలంటూ పీఆర్సీ సిఫారసు చేసిందని గుర్తు చేశారు. వారి జీతాన్ని ఏటా 10 శాతం చొప్పున పెంచేందుకు తగు నిర్ణయం చేయాలని పేర్కొన్నారు. ఈ అంశాలపై మంత్రివర్గ సమావేశంలో తగు నిర్ణయం తీసుకోవాలని సిఎం రేవంత్‌రెడ్డికి ఆయన విజ్ఞప్తి చేశారు.

కాళేశ్వరం కమిషన్ బహిరంగ విచారణ మళ్లీ షురూ...

- కీలక విషయాలను వెల్లడించిన ఇంజనీర్లు

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

కాళేశ్వరం కమిషన్ బహిరంగ విచారణ మళ్లీ మొదలైంది. బుధవారం కాళేశ్వరం కమిషన్ విచారణకు ఆపరేషన్ అండ్ మెయింటనెన్స్ ఇఎన్‌సి నాగేందర్, క్వాలిటీ కంట్రోల్ చీఫ్ ఇంజనీర్ అజయ్‌కుమార్ హాజరయ్యారు. ఈ సందర్భంగా వారిపై కాళేశ్వరం కమిషన్ ప్రశ్నల వర్షం కురిపించింది. ఓపెన్ కోర్టులో వాడి వేడిగా విచారణ సాగింది. దాదాపు మూడు గంటల పాటు 130కి పైగా ప్రశ్నలు వేసినట్టు తెలుస్తోంది. కమిషన్ ముందు సదరు ఇంజినీర్లు కీలక అంశాలు వెల్లడించారు. మేడిగడ్డ బ్యారేజీ పూర్తి అయినట్టు ఇచ్చిన సర్టిఫికెట్‌లో నిబంధనలు పాటించలేదని నాగేందర్ తెలిపారు. ఈ సందర్భంగా క్వాలిటీ చెక్ చేయకుండా అఫిడవిట్ ఎలా ఇస్తారంటూ కాళేశ్వరం కమిషన్ ఆగ్రహం వ్యక్తం చేసింది. ఇప్పటి వరకు ఎన్ని సార్లు మేడిగడ్డ, అన్నారం విజిట్ చేశారో చెప్పాలనీ, అదే సమయంలో సుందిళ్లను ఎందుకు పరిశీలించలేదంటూ కమిషన్ ప్రశ్నించింది. అయితే, తాము మేడిగడ్డ, అన్నారం బ్యారేజీలను ప్రమాదం జరగకముందు విజిట్ చేశానంటూ క్వాలిటీ కంట్రోల్ సీఈ సమాధానమిచ్చారు.

నిబంధనలు ఏమైనా పాటించారా..?

కాళేశ్వరం కమిషన్ ఓపెన్ కోర్టు విచారణలో బుధవారం మధ్యాహ్నం తర్వాత క్వాలిటీ కంట్రోల్ చీఫ్ ఇంజనీర్ అజయ్ కుమార్ కమిషన్ ఎదుట హాజరయ్యారు. అజయ్ కుమార్ పై కమిషన్ ప్రశ్నల వర్షం కురిపించింది. క్వాలిటీ కంట్రోల్ సిఇ స్థాయిలో ఉండి రికార్డ్స్ చెక్ చేయకుండా అఫిడవిట్ ఎలా సబ్మిట్ చేస్తారని ప్రశ్నించింది. క్వాలిటీ కంట్రోల్ పని ఏంటి? పరిధి ఏంటి? ఇప్పటివరకు ఏం పని చేశారు? అంటూ ప్రశ్నల వర్షం కురిపించింది. మేడిగడ్డ, సుందిళ్ల బ్యారేజీలను ఎన్నిసార్లు విజిట్ చేశారని అడిగింది. దీనికి ఈ రెండు బ్యారేజీలను ప్రమాదం జరగక ముందు పరిశీలించానని తెలిపారు. సుందిళ్లను ఎందుకు పరిశీలించలేదని ప్రశ్నించింది. మొదటి సారి ఫ్లడ్స్ వచ్చిన తర్వాత మూడు బ్యారేజీలను క్వాలిటీ కంట్రోల్ సీఈగా విజిట్ చేశారా..? అని కమిషన్ ప్రశ్నించింది. గ్రౌండ్‌లో సమస్యలు ఉన్నాయని రిపోర్టులు రావడంతో విజిట్ చేయలేదని అజయ్ కుమార్ వివరణ ఇచ్చారు.

ఇఎన్‌సికి 130 ప్రశ్నలు

అంతకు ముందు ఉదయం విచారణకు హాజరైన ఈఎన్సీ నాగేందర్‌పై కాళేశ్వరం కమిషన్ ప్రశ్నల వర్షం కురిపిస్తూనే ఆగ్రహం వ్యక్తం చేసింది. దాదాపు మూడు గంటలపాటు ఆయనను ప్రశ్నించింది. దాదాపు 130కి పైగా ప్రశ్నలు వేసినట్టు తెలుస్తోంది. మేడిగడ్డ బ్యారేజీ పూర్తి అయినట్లు ఇచ్చిన సర్టిఫికెట్‌లో నిబంధనలు పాటించలేదని నాగేందర్ తెలిపారు. రామగుండం ఈఎన్‌సీ చేతిలోనే మూడు బ్యారేజీలు నడిచినట్లు కమిషన్ ముందు చెప్పారు. ఆయన నిబంధనలు పాటించలేదని తెలిపారు. మెయింటెనెన్స్ సరిగ్గా లేకపోవడం వల్లే బ్యారేజీలలో లీకేజీలు జరిగాయా అని.. గేట్స్ ఆపరేషన్ ఎవరి ఆధ్వర్యంలో జరుగుతాయి? నీళ్లను ఎవరు స్టోరేజ్ చేయమన్నారని కమిషన్ ప్రశ్నించింది. వరదల సమయంలో గేట్లు ఓపెన్ చేయకూడదని ఎవరు ఆదేశించారని అడిగింది. మెయింటెనెన్స్ అండ్ ఆపరేషన్ డిపార్ట్‌మెంట్ మాన్యువల్ ప్రిపేర్ చేసిందా? అంటూ ఈఎన్‌సీ నాగేందర్‌ను కాళేశ్వరం కమిషన్ ప్రశ్నించినట్టు తెలుస్తోంది. 2021 జనవరి వరకు ఆపరేషన్ సైన్ మెయింటెనెన్స్ కోసం ప్రత్యేకమైన సిబ్బంది లేరని కమిషన్ ముందు నాగేందర్ తెలిపారు. 2021 జనవరిలో ఆపరేషన్ అండ్ మైంటెనెన్స్ టీం ఫామ్ అయిన తర్వాత రామగుండం ఈఎన్‌సీకి రిపోర్టు ఇచ్చామని తెలిపారు. ఈ సందర్భంగా రామగుండం ఈఎన్‌సీ చేతిలోనే మూడు బ్యారేజీలు నడిచినట్టు కమిషన్ ముందు చెప్పడంతో.. మెయింటెనెన్స్ సరిగ్గా లేకపోవడం వల్లే బ్యారేజీల్లో లీకేజీలు జరిగాయా అని.. గేట్స్ ఆపరేషన్ ఎవరి ఆధ్వర్యంలో జరుగుతాయి? నీళ్లను ఎవరు స్టోరేజ్ చేయమన్నారని కమిషన్ ప్రశ్నించింది. అలాగే వరదల సమయంలో గేట్లు ఓపెన్ చేయకూడదనీ, పరిమితికి మించి మ్యారేజీలలో నీళ్లను స్టోర్ చేయమని ఎవరు ఆదేశించారని కమిషన్ అడిగింది.

చేయలేదు.. పాటించలేదు..!

ఈ క్రమంలోనే రామగుండం ఈఎన్‌సీ నిబంధనలు పాటించలేదని కమిషన్ ముందు ఈఎన్‌సీ నాగేందర్ చెప్పినట్టు తెలుస్తోంది. రామగుండం ఈఎన్‌సీ స్టేట్ అండ్ సెంట్రల్ డ్యామ్ సేఫ్టీ నిబంధనలు పాటించలేదన్నట్టుగా కమిషన్ ముందు చెప్పారు. ఆపరేషన్ అండ్ మెయింటెనెన్స్ సరిగ్గా లేకపోవడం వల్లనే మూడు బ్యారేజీలు డ్యామేజ్ అయ్యాయా? అని కమిషన్ పదేపదే ప్రశ్నించింది. దీంతో మెయింటెనెన్స్ లేదని ఒప్పుకున్నారు. ఆపరేషన్ అండ్ మెయింటనెన్స్ ఇచ్చిన రిపోర్ట్స్‌పై ఎలాంటి యాక్షన్ రామగుండం ఈఎన్‌సీ తీసుకోలేదన్నారు. ఓ అండ్ ఎం ఇన్స్పెక్షన్ రిపోర్టును కమిషన్‌కు ఈఎన్‌సీ నాగేందర్ సమర్పించారు. సీడబ్ల్యూసీ మాన్యువల్ నిబంధనలు ఫాలో చేశారా? అని కమిషన్ అడిగిన ప్రశ్నలకు ఫాలో చేయలేదని నాగేందర్ సమాధానం ఇచ్చారు. "ఐఎస్ కోడ్ పాటించారా?" అని అడుగగా.. లేదని ఆన్సర్ ఇచ్చారు. డ్యామ్ సేఫ్టీ నిబంధనలు పాటించారా? అని అధికారులను కాళేశ్వరం కమిషన్ అడిగింది. నిర్మాణ సంస్థలు అగ్రిమెంట్ ఆపరేషన్స్ ప్రోటోకాల్ డ్యామ్ సేఫ్టీ ఆక్ట్ ఫాలో అయ్యారా అన్న ప్రశ్నకు కాలేదని నాగేందర్ సమాధానం చెప్పారు. వెథర్స్ షెడ్యూల్ ఫాలో అయ్యారా అని ప్రశ్నించగా.. దానికి కూడా కాలేదనే ఈఎన్సీ సమాధానం చేశారు. మూడు బ్యారేజీలలో నీళ్లను నిల్వ చేశారా? అని కమిషన్ ప్రశ్నించగా.. 2019 నుంచి మూడు బ్యారేజీలలో పరిమితి నీళ్లను నిలువ చేసినట్టు కమిషన్ ముందు నాగేందర్ వెల్లడించారు. ప్రమాదం జరిగే ముందు ఓ అండ్ ఎం పరిశీలన చేశారా? అని.. బ్యారేజీల్లో నీళ్లను నిలువ చేయాలని ఎవరు ఆదేశించారంటూ కమిషన్ అడిగిన ప్రశ్నకు... రామగుండం ఈఎన్సీకి మౌకిక ఆదేశాలు ఉన్నాయి అన్నట్టుగా కమిషన్ ముందు ఈఎన్‌సీ నాగేందర్ చెప్పుకొచ్చారు.

కోర్టుకు హాజరైన కెటిఆర్

నాంపల్లి కోర్టులో కెటిఆర్ వాంగ్మూలం

- కొండా సురేఖ వ్యాఖ్యలు నాతోపాటు పార్టీకి నష్టం కలిగించాయి : కెటిఆర్
- కెటిఆర్, దాసోజు శ్రావణ్ స్టేట్‌మెంట్ రికార్డు చేసిన కోర్టు

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

మంత్రి కొండా సురేఖపై దాఖలు చేసిన పరువు నష్టం కేసులో హైదరాబాద్ నాంపల్లి కోర్టులో బుధవారం కెటిఆర్ వాంగ్మూలం ఇచ్చారు. కొండా సురేఖ వ్యాఖ్యలు తనతో పాటు పార్టీకి కూడా తీవ్రంగా నష్టం చేకూర్చే విధంగా ఉన్నాయని కెటిఆర్ స్టేట్‌మెంట్ ఇచ్చారు. తనపై ఆమె చేసిన కామెంట్లను చూసి సాక్షులు తనకు ఫోన్ చేశారన్నారు. కొండా సురేఖ వ్యాఖ్యలు అత్యంత జుగుప్సాకరంగా ఉన్నాయని వాటిని విని షాక్‌కు గురయ్యానని తెలిపారు. బాధ్యత గల మంత్రి పదవిలో ఉండి అత్యంత దిగజారుడు వ్యాఖ్యలను కొండా సురేఖ చేశారని కేటీఆర్ తన వాంగ్మూలంలో తెలిపారు. ఆమె మాట్లాడిన మాటలు కొన్ని చెప్పలేని విధంగా ఉన్నాయని చెప్పారు. తాను డ్రగ్ అడిక్ట్ అని, రేవ్ పార్టీలు నిర్వహిస్తానంటూ ఎలాంటి ఆధారాలు లేకుండా కేవలం పబ్లిసిటీ కోసమే కొండా సురేఖ వ్యాఖ్యలు చేశారన్నారు. ఆమె చేసిన వ్యాఖ్యలు అన్ని చెప్పలేకపోతున్నానని, ఫిర్యాదులో ఉన్న అంశాలను పరిగణలోకి తీసుకోవాలని కోర్టును కేటీఆర్ కోరారు. దాదాపు అరగంట పాటు కోర్టులో కేటీఆర్ తన వాంగ్మూలాన్ని ఇచ్చారు. కొండా సురేఖ చేసిన కామెంట్ల వీడియోలను ఈ సందర్భంగా కోర్టుకు సమర్పించారు. కేటీఆర్‌తో పాటు సాక్షిగా ఉన్న దాసోజు శ్రవణ్ స్టేట్‌మెంట్‌ను కూడా కోర్టు నమోదు చేసుకుంది. మిగతా సాక్షుల స్టేట్‌మెంట్ల రికార్డ్‌ను కోర్టు ఈ నెల 30కి వాయిదా వేసింది. ఈ నెల 21నే స్టేట్‌మెంట్ రికార్డ్ చేయాల్సి ఉన్నప్పటికీ కేటీఆర్ అభ్యర్థన మేరకు గురువారం వరకు కోర్టు సమయమిచ్చింది. ఈ మేరకు తెలంగాణ భవన్ నుంచి కేటీఆర్ సహా ఈ కేసులో సాక్షులుగా ఉన్న దాసోజు శ్రవణ్, ఎమ్మెల్సీ సత్యవతి రాథోడ్, బాల్క సుమన్, మాజీ మంత్రి జగదీష్‌తో పాటు బీఆర్ఎస్ నేతలు నాంపల్లి కోర్టుకు వచ్చారు.

నారాయణ కాలేజీలో విద్యార్థి మృతి

- భవనం పైనుంచి కిందికి దిగుతుండగా ప్రమాదం

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

ఓ విద్యార్థి భవనం పైనుంచి కిందికి దిగుతుండగా ప్రమాదవశాత్తు జారి పడి మృతిచెందిన ఘటన రంగారెడ్డి జిల్లా మాదాపూర్ పీఎస్ పరిధిలోని నారాయణ బాసర, సరస్వతి క్యాంపస్‌లో జరిగింది. సిఐ కృష్ణమోహన్ తెలిపిన వివరాల ప్రకారం.. ఆంధ్రప్రదేశ్‌లోని కడప జిల్లా రైల్వే కోడూరుకు చెందిన శివకుమార్‌రెడ్డి (17) నారాయణ కాలేజీలో ఇంటర్మీడియట్ ఎంపిసి సెంకడ్ ఇయర్ చదువుతున్నారు. శివకుమార్‌రెడ్డి తోటి విద్యార్థులతో కలిసి మంగళవారం అర్ధరాత్రి బయటకు వెళ్లేందుకు ప్రయత్నించారు. ఈ క్రమంలో ఐదవ అంతస్తు రూమ్ నెంబర్ 501 కిటికీలో నుంచి కిందికి దిగి బయటకు వెళ్లే ప్రయత్నంలో కాలుజారి కిందపడి చనిపోయారు. గమనించిన ఇతర విద్యార్థులు ఈ విషయాన్ని నిర్వాహకుల దృష్టికి తీసుకెళ్లారు. అయితే, ఐదవ అంతస్తు నుంచి విద్యార్థులు ఎలా దిగే ప్రయత్నం చేశారనే విషయంపై అనేక అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. విద్యార్థి ఆత్మహత్య చేసుకున్నాడా లేక కాలుజారి కిందపడ్డాడా అనే అంశం ఇంకా తేలాల్సి ఉంది. విద్యార్థి మృతి నేపథ్యంలో కాలేజీ వద్ద ఆందోళనలు జరిగే అవకాశం ఉందని పోలీసులు కట్టుదిట్టమైన బందోబస్తు ఏర్పాటు చేశారు. ఇద్దరు సీఐలు, ముగ్గురు ఎస్ఐలు, 20 మందికి పైగా కానిస్టేబుల్స్‌తో బందోబస్తు నిర్వహించారు. విద్యార్థి మరణంపై విద్యార్థి సంఘాలు అనుమానం వ్యక్తం చేస్తున్నారు. నారాయణ కాలేజీలో వరుసగా ఇలాంటి ఘటనలు చోటుచేసుకుంటున్నా ఇంటర్మీడియట్ బోర్డు తీవ్ర నిర్లక్ష్యం చేస్తోందని ఎస్ఎఫ్ఐ రంగారెడ్డి జిల్లా కార్యదర్శి శంకర్ ఆగ్రహం వ్యక్తం చేశారు. వెంటనే నారాయణ కాలేజీ గుర్తింపు రద్దు చేయాలి డిమాండ్ చేశారు.

ధర్నా చేస్తున్న విద్యార్థులు

బస్సులను పెంచాలని విద్యార్థుల ధర్నా

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

విద్యార్థుల సంఖ్యకు అనుగుణంగా బస్సుల సంఖ్యను పెంచాలని డిమాండ్ చేస్తూ రంగారెడ్డి జిల్లా చేవెళ్ల మండల కేంద్రంలో ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో విద్యార్థులు నిరసన తెలిపారు. బుధవారం రంగారెడ్డి జిల్లా చేవెళ్ల మండల కేంద్రంలోని బస్ స్టేషన్ ఎదురుగా పెద్ద ఎత్తున రాస్తారోకో నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్ఎఫ్ఐ చేవెళ్ల డివిజన్ కార్యదర్శి బేగరి అరుణ్‌కుమార్ మాట్లాడుతూ.. విద్యార్థుల సంఖ్యకు అనుగుణంగా కళాశాలల, పాఠశాలల సమయానికి అనుగుణంగా ఆర్టీసీ అధికారులు గ్రామాలకు బస్సులు నడపాలని డిమాండ్ చేశారు. చాలా గ్రామాలకు బస్సు సౌకర్యాలు లేక విద్యార్థులు పాఠశాలలకు, కళాశాలలకు రావడానికి చాలా ఇబ్బంది పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. రోజూ సాయంత్రం అయితుందంటే విద్యార్థులతో బస్టాండ్ నిండిపోతుందని చెప్పారు. బస్సుల్లో విద్యార్థులు వేలాడుతూ ప్రయాణాలు చేస్తున్నారని, విద్యార్థులకు ఏమైనా ప్రమాదం జరిగితే ప్రభుత్వమే బాధ్యత వహించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ నాయకులు బేగరి తేజ, సాయి గణేష్, చరణ్‌గౌడ్, సమీర్, చందు, నవీన్, సందీప్, విద్యార్థులు, తదితరులు పాల్గొన్నారు.

23 మంది కాంట్రాక్టు అధ్యాపకుల క్రమబద్ధీకరణ

- ఉత్తర్వులు విడుదల

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

రాష్ట్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో పనిచేస్తున్న 23 మంది కాంట్రాక్టు అధ్యాపకులను ప్రభుత్వం క్రమబద్ధీకరణ చేసింది. ఈ మేరకు విద్యాశాఖ ముఖ్యకార్యదర్శి బుర్రా వెంకటేశం బుధవారం (జీవోనెంబర్ 35) ఉత్తర్వులను విడుదల చేశారు. 2016, ఫిబ్రవరి 26న జారీ చేసిన జీవోనెంబర్ 16 ప్రకారం ప్రభుత్వ జూనియర్ కాలేజీల్లో పనిచేస్తున్న కొందరు కాంట్రాక్టు అధ్యాపకులు గతంలో క్రమబద్ధీకరణ కాలేదని తెలిపారు. వారు మంజూరైన పోస్టుల్లోనే పనిచేస్తున్నారని పేర్కొన్నారు. వారి సర్వీసులను క్రమబద్ధీకరణ చేసేందుకు అన్ని అర్హతలూ ఉన్నాయని గుర్తించామని తెలిపారు. గతంలో వారికి క్రమబద్ధీకరణకు అవసరమైన ధ్రువపత్రాలు అందుబాటులో లేవని పేర్కొన్నారు. ఇప్పుడు వారికి అన్ని పత్రాలూ ఉన్నాయనీ, రెగ్యులరైజ్ చేసేందుకు అర్హులని గుర్తించామని తెలిపారు. ఆయా పోస్టులకు సంబంధించి వారి కంటే సీనియర్లు ఎవరూ లేరని స్పష్టం చేశారు. అందుకే వారి సర్వీసులను క్రమబద్ధీకరిస్తున్నామని వివరించారు. 23 మంది కాంట్రాక్టు అధ్యాపకుల క్రమబద్ధీకరణ చేయడం పట్ల తెలంగాణ గెజిటెడ్ జూనియర్ లెక్చరర్ల సంఘం (టీజీజేఎల్‌ఏ-475) అధ్యక్షులు వి శ్రీనివాస్, ప్రధాన కార్యదర్శి కొప్పిశెట్టి సురేష్ హర్షం ప్రకటించారు. రాష్ట్ర ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలిపారు. కొంతమంది అధికారుల సమాచార లోపం, ఇతర కారణాల వల్ల ప్రభుత్వ జూనియర్, డిగ్రీ కాలేజీల్లో క్రమబద్ధీకరణ జరగని కాంట్రాక్టు అధ్యాపకులున్నారని పేర్కొన్నారు. వారి సర్వీసులను కూడా క్రమబద్ధీకరణ చేయాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరారు.